
సాక్షి ఒడిశా

బుధవారం, 25, అక్టోబర్, 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,17,826లు వచ్చాయని అధికారులు తెలిపారు.



అది పెద్ద పులే

ఆంధ్రా–ఒడిషా రాష్ట్రాల సరిహద్దులో సంచరిస్తున్నది పెద్దపులేనని ఫారెస్టు అధికారులు స్పష్టం చేశారు.

- 8లో



చదువుకు అవకాశం

చదువుకోవాలని ఆసక్తి ఉండి అవకాశాలు లేక, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, రోజువారి స్కూల్/కాలేజీకి వెళ్లలేక.. చదువుకోని వారికి ఓపెన్ స్కూల్ బాసటగా నిలుస్తోంది

- 8లో

న్యూస్‌రీల్

భారీగా గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలోని కథబాల్ గ్రామం వద్ద 175 కేజీల గంజాయి సోమవారం రాత్రి పట్టుబడింది. బలిమెల నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారును మల్కన్‌గిరి పోలీసులు తనిఖీ చేశారు. అందులో గంజాయి బస్తాలను గుర్తించారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మల్కన్‌గిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమ, మంగళవారాలు కోర్టుకు సెలవు కావడంతో నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు. గంజాయి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. మహారాష్ట్రకు చెందిన ఆందరావు మహాదేవ్ బాధర్, అస్రఫ్ రియాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు.

జేకేపూర్‌లో రావణ దహనం



రావణ దహన దృశ్యం

రాయగడ: జేకేపూర్‌లో మంగళవారం రావణ దహనం ఘనంగా జరిగింది. ఎస్పీ వివేకానంద శర్మ ఆయన సతీమణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాది మంది వీక్షించారు.

సేరివీధి భేతాళ క్లబ్‌లో..



సేరి వీధి భేతాళ క్లబ్‌లో ఆయుధపూజ

పర్లాకిమిడి: స్థానిక సేరివీధి జంక్షన్‌లోని భేతాళ క్లబ్‌లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. భేతాళ క్లబ్‌లో విజయదశమి సందర్భంగా సమరయోధులు ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా కత్తి, డాలు, కర్రసాములు సేరివీధి సమరయోధులు ప్రదర్శించారు.

ఫుట్‌బాల్ విజేత మనిపురియ టీమ్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథి సుభాష్ రౌత్

జయపురం: జయపురం సమితి జయంతిగిరి పంచాయతీ స్థాయిలో హడియ గ్రామంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నీలో మనిపురియ టీమ్ విన్నర్‌గా నిలిచింది. టోర్నమెంట్ ఫైనల్ మనిపురియ–కుములిపుట్ గ్రామాల మధ్య సోమవారం హోరాహోరీగా జరిగింది. ఈ పోటీలో మనిపురియ 4–3 తేడాతో విజయం సాధించింది. ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, వ్యాపారి సుభాష్ రౌత్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. విన్నర్లకు రూ.9వేలు, రన్నర్ టీమ్‌కు రూ.7వేలు నగదు ఇచ్చి సత్కరించారు.

గురుకుల విద్యార్థికి ప్రధాని ప్రశంస



గార నితీష్

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర విద్యా శాఖ 'భారత్ సాంకేతిక ప్రగతి' అన్న అంశంపై దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించింది. దీనికి ఎస్ఎం పురం ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి గార నితీష్ వ్యాసం పంపాడు. ఈ విద్యార్థి సొంత ప్రాంతం పొందూరు మండలం గారపేట. పాతికేళ్ల తర్వాత ఈ పోటీలను కేంద్రం నిర్వహిస్తోంది. ఈ పోటీలో నితీష్ రాసిన వ్యాసాన్ని ప్రధాని మెచ్చుకున్నట్లు పేర్కొంటూ ఓ ప్రశంసా పత్రాన్ని పోస్టు ద్వారా విద్యార్థికి పంపించారు. దేశ సాంకేతిక ప్రగతి ప్రతిభ, భవిష్యత్‌లో ప్రపంచ స్థాయిలో సాధించే విజయాలను ఊహించి విద్యార్థి ఈ వ్యాసాన్ని రాశాడు.



జయపురం రాజమహల్



రాజ దర్బార్



సూర్యమహల్ లో జయపురం రాజు కాంస్య విగ్రహం



సోమవారం రాత్రి సునావేశ ంలో మాభగవతి

దేదీప్యమానం..

దసరా వేడుకల సందర్భంగా ఊరూవాడా ఉత్సాహంగా గడిపింది. కోటల నుంచి పేటల వరకు ప్రాంతాలన్నీ దేదీప్యమానంగా వెలిగిపోయాయి. అమ్మవారి ఆలయాల్లో ఆయుధ పూజలతోపాటు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సామాన్యులతో పాటు ప్రముఖులు ఉత్సవాల్లో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



సూర్యమహల్ ప్రాంగణంలో ఫిరంగి దేవిని పూజిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: దసరా వేడుకల సందర్భంగా జయపురం రాజ మందిరం విద్యుత్ దీపాల వెలుగులతో దేదీప్యమానంగా కనిపించింది. అలాగే పూజా మండపాలు భక్తులతో పోటెత్తాయి. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పూజా మండపాలను దర్శించి పూజలు చేశారు. జయపురంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సూర్యమహల్ ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ కేశబ ప్రభాత్ శాఖ ఉత్సవాలు నిర్వహించింది. పట్టణ ఆర్ఎస్ఎస్ నేత విష్ణు ప్రసాద్ సాహు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా గోసేవ ప్రముఖులు మధుసూదన రావు దసరా ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించారు.

విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో..

జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడలో విశ్వ హిందూ పరిషత్ నిర్వహిస్తున్న దుర్గా వాహినీ దసరా ఉత్సవాల సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. సరస్వతీ శిశుమందిర ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యవక్తగా ప్రాంతీయ కోఆర్డినేట ర్ స్మృతి బాజపాయ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో దుర్గా వాహిణీ కొరాపుట్ జిల్లా కోఆర్డినేటర్ గౌరీ పరజ, బొయిపరిగుడ దుర్గా వాహిణీ కోఆర్డినేటర్ సునీల మఝి, చంచలా మీనర్, హేమంత మఝి, సునామణి మఝి, జితా మఝి తదితరులు పాల్గొన్నారు.

జేకే పూర్‌లో..

రాయగడ: జేకేపూర్‌లో నిర్వహించిన దసరా ఉత్సవాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఎస్పీ వివేకానంద శర్మ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను తిలకించారు. కేకే పేపర్ మిల్ ఉపాధ్యక్షుడు వినయ్ ద్వివేది, పూజా కమిటీ అధ్యక్షుడు విశ్వజిత్ ద్వివేది, కార్యదర్శి శైలేంద్ర కుమార్ సాయంతరాయ్, గణేష్ సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మజ్జి గౌరి మందిరంలో సోమవారంతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారు సునా భెషాలా భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం నాడు తొమ్మిది మంది చిన్నారులను అమ్మవారిలా ముస్తాబు చేసి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.



సునా భెషాలొ మజ్జిగౌరి అమ్మవారు



దసరా ఉత్సవంలో నందపూర్‌లో రాజుల 32 మెట్ల సింహాసనం లో భక్తులు



మదలా సాహిలో కనకదుర్గకు పూజలు



వీధుల్లో వాహనాలకు పూజలు చేస్తున్న దృశ్యం



అమ్మవారి రూపంలో పూజలందుకుంటున్న చిన్నారులు



జేకేపూర్‌లో పూజలందుకుంటున్న అమ్మవారు



జేకేపూర్‌లో దసర ఉత్సవాలను వీక్షిస్తున్న ఎస్పీ శర్మ, ద్వివేది తదితరులు



జేకే పూర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు



విశ్వహిందూ పరిషత్ వారి దుర్గా వాహినీ కార్యక్రమంలో నిర్వహించిన ర్యాలీ



దసరా ఉత్సవంలో ప్రసంగిస్తున్న నేతలు



మజ్జి గౌరి మందిరం వద్ద వాహన పూజలు

• పలు సంప్రదాయాల్లో..



దాండియాలో పాల్గొన్న మార్వాడీలు

మల్కన్‌గిరిలో మంగళవారం ఘనంగా దసరా వేడుకలు నిర్వహించారు. స్థానిక డీఎన్‌కే కూడలి వద్ద ఉన్న దుర్గా మండపంలో బెంగాలీ సంప్రదాయ ప్రకారం సిందుర్ ఖేల్ నిర్వహించారు. అలాగే మార్వాడీలు దాండియా ఆడారు. స్థానిక నక్కిటమ్మ మందిరం వద్ద కుంకుమ పూజలు జరిగాయి.

– మల్కన్‌గిరి



డీఎన్‌కే దుర్గ మండపం వద్ద సిందుర్ ఖేల్ ఆడుతున్న మహిళలు

• ఆర్మ్‌డ్ పోలీసు బెటాలియన్ బ్యారక్ వద్ద



బెత్తగుడ రిజర్వ్‌డ్ పోలీసు బెటాలియన్ కార్యాలయంలో దసరా వేడుకల్లో పాల్గొన్న తిరుపతి పాణిగ్రాహి.

పర్లాకిమిడి: స్థానిక బెత్తగుడలోని ఆర్మ్‌డ్ పోలీసు రిజర్వ్‌డ్ కార్యాలయం వద్ద దసరా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, హైటెక్ మెడికల్ కళాశాలల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో తపస్వీ కోరో ఒడిషా నృత్యం ప్రేక్షకులకు అలరించింది. అనంతరం స్థానిక డ్యాన్స్ స్కూల్ కళాకారులు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు. కళాకారులకు కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సునీల్ మహంతి, డీఎస్పీ ఎల్.ఆచారి, రిజర్వుడు ఇనెస్పెక్టర్ సత్యకాంత జెన్నా, నిరంజన్ నాయక్‌లు పాల్గొన్నారు.



ఒడిస్సీ నృత్యం ప్రదర్శించిన తపస్వీ కోరో



బాలికల సాంప్రదాయ నృత్యం



డ్యాన్స్ స్కూల్ విద్యార్థినుల నృత్యం



బెబర్తావీధిలో అమ్మవారి సన్నిధిలో ఒడిషా సమరయోధుల కరములు,ఇతర సామగ్రికి పూజా దృశ్యం

క్లుప్తంగా

అక్కుపల్లిలో ప్లాస్టిక్ రహిత అన్నసంతర్పణ



అక్కుపల్లిలో అన్నసంతర్పణలో భక్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేవి నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా అక్కుపల్లిలో సోమవారం సుమారు 4 వేల మంది భక్తులకు ప్లాస్టిక్ రహిత అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఎలాంటి కాలుష్యం లేని అరటి ఆకులు, తెల్లని కాగితం, కంచు గ్లాసలలో మంచినీరు, ఇతర పదార్థాలు వడ్డించారు. పూజా కమిటీ నిర్వాహకులను స్థానికులు అభినందించారు.

దసరా బస్సులు రద్దీమయం



నాన్‌స్టాప్ బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: దసరా పండగ సందర్భంగా వచ్చిన ప్రయాణికులు మళ్లీ తిరుగుముఖం పట్టడంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు రద్దీమయంగా కనిపించాయి. దసరా పండగ సెలవులు మంగళవారంతో ముగియడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు మళ్లీ వారి వారి కళాశాలలకు, విధులకు హాజరయ్యేందుకు తిరుగుపయనం కావడంతో బస్సులు రద్దీగా కనిపించాయి. శ్రీకాకుళంలోని నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద క్యూలో ప్రయాణికులు టికెట్‌ల కోసం బారులు తీరుతూ కనిపించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడుపుతున్నారు.

విద్యుత్ షాక్‌తో బైక్ మెకానిక్ మృతి



బెహర రమేష్(ఫైల్)

ఇచ్ఛాపురం: పట్టణంలో షరాబువీధికి చెందిన బైక్ మెకానిక్ బెహర రమేష్(35) విద్యుత్ షాక్‌కి గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. రమేష్ దసరా సందర్భంగా సోమవారం సాయంత్రం గ్యారేజ్‌లో కస్టమర్ల ద్విచక్ర వాహనాలకు వాటర్‌సర్వీసింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కి గురయ్యాడు. వెంటనే తోటి మెకానిక్‌లు అతడిని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు ఆయన నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో పట్టణ పోలీస్ హెచ్‌సీ విశ్వనాధం కేసు నమోదు చేశారు. పండగ పూట మెకానిక్ మృతితో పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మనుగడ కోసమే టీడీపీ-జనసేన పొత్తులు



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: టీడీపీ, జనసేన పార్టీలు వాటి మనుగడ కోసమే పొత్తులు ప్రకటించుకున్నాయని, ప్రజా సంక్షేమం గురించి వాటికి నిబద్ధత లేదని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన పార్టీలు మునిగిపోవటం ఖాయమన్నారు. టీడీపీ-జనసేన పొత్తు వల్ల జనసేన కార్యకర్తల మనోభావాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని అన్నారు. అవినీతిపై పోరాడుతానని ప్రగల్భాలు పలికే పవన్ కల్యాణ్ ఇప్పుడు అవినీతి చేసి జైలులో ఉన్న చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని గుర్తు చేశారు. ఇది పవన్ కల్యాణ్ నిలకడలేమికి నిదర్శనమన్నారు. వ్యవస్థలన్నింటినీ గుప్పెట్లో పెట్టుకుని అవినీతి చేసిన చంద్రబాబు ఇక శాశ్వతంగా జైలులోనే ఉంటారన్నారు. సమావేశంలో పార్టీ కార్యకర్తలు కొప్పల ఈశ్వరరావు, కెప్టెన్ రామారావు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు రాజరాజేశ్వరి దేవిగా కోటదుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమి సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

అది పెద్ద పులే..

- పలాస మండలం లొత్తూరులో కాలిముద్రలు
- అటవీ శాఖ అధికారుల స్పష్టీకరణ

కాశీబుగ్గ: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో సంచరిస్తున్నది పెద్దపులేనని ఫారెస్టు అధికారులు స్పష్టం చేశారు. మంగళవారం వేకువజామునకు పలాస మండలం లొత్తూరు గ్రామ సమీపంలో పాదముద్రలు కనిపించాయని అన్నారు. గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని, పెద్దపులి సంచారం కొనసాగుతోందని మైకులో ప్రచారం చేస్తున్నారు. అయితే పెద్దపులి సంచారంపై సోషల్ మీడియాలో జోరుగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాట్సాప్, ఫేస్‌బుక్‌లు, స్టాటస్‌లలో పులిని చంపేసినట్లు, పట్టుకున్నట్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రెండు రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. పెద్దపులి ఐదురోజులకు సరిపడా ఆహారం తీసుకుంటూ అనంతరం విశ్రాంతిలో ఉంటుందని అన్నారు. కేవలం రాత్రి సమయంలోనే సంచరిస్తుందని, ఒడిశా రాయగడ బ్లాక్‌లో ఉన్న బురుజోల కొండ నుంచి పలాస మండలం లొత్తూరు గ్రామం, చిన్నపలియా, పరిసర ప్రాంతాల్లో పాదముద్రలు స్పష్టంగా కనిపించాయని వివరించారు.

సుమారు ఏడు ఇంచీలు ఉన్న పాదముద్రలు చూసిన గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ఐదు అడుగుల ఎత్తు, ఏడు అడుగులు పొడవు ఉండవచ్చునని అంచనా వేస్తున్నామ ని అన్నారు. వారం కిందట మొదలైన పెద్దపులి సంచారం మంగళవారం నాటికి పలాస మండలం లొత్తూరు గ్రామానికి చేరడంతో ఒడిశా రాష్ట్రం మహేంద్ర ఫారెస్టు రేంజ్ పరిధిలో ఉన్న ఫారెస్టు అధికారి నిధిసాయి నేతృత్వంలో మూడు బృందాలు పాతముద్రల వేటలో పడ్డాయి. ఫారెస్టు అధికారులతో పాటుగా వైల్డ్ లైఫ్ సెక్యూరిటీ సిబ్బంది సుమారు 30 మంది రంగంలోకి దిగారు. అరుదైన పులి కావడంతో మత్తుమందు ఇచ్చి పట్టుకొనే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కాశీబుగ్గ ఫారెస్టు రేంజ్ అధికారి మురళీకృష్ణంనాయుడు మాట్లాడుతూ పులిని చంపేసినట్లు తప్పుడు కథనాలు, వీడియోలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, పెద్దపులి కదలికలు ఉన్నాయని తెలిపారు.



సీసీ పుటేజీలో బెంగాల్ టైగర్



మహేంద్రగిరి పర్వతాల ప్రారంభం వద్ద అటవీ శాఖ అధికారులు



మహేంద్రగిరి పర్వతాలలో జల్లెడ పడుతున్న ఫారెస్టు, వైల్డ్‌లైఫ్ సెక్యూరిటీ



తాగునీటి కోసం వచ్చిన చెరువు వద్ద పులి పాదముద్రల పరిశీలనలో అధికారులు

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మనోళ్ల సత్తా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు మరోసారి ప్రభంజనాన్ని సృష్టించారు. చిత్తూరు జిల్లా నగరి వేదికగా ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు 8వ ఏపీ జూనియర్స్ (అండర్-19) బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలబాలికల జట్లు సత్తాచాటాయి. ముఖ్యంగా బాలికల జట్టు తమ జైత్రయాత్రను కొనసాగించింది. బాలుర జట్టు క్వార్టర్స్‌లో నిష్క్రమించగా.. బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. పటిష్టమైన విశాఖతో జరిగిన హోరాహోరీ ఫైనల్ మ్యాచ్‌లో 35-20, 35-26 తేడాతో శ్రీకాకుళం బాలికల జట్టు స్వల్పతేడాతో ఓటమిపాలై ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో రజత పతకాలు, ప్రశంసా పత్రాలను రాష్ట్ర పర్యాటక, క్రీడలశాఖ మంత్రి ఆర్‌కె రోజా చేతులమీదుగా అందుకున్నారు. జిల్లా జట్ల రాణింపు, జాతీయ పోటీలకు ఇద్దరు ఎంపిక కావడంపై ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధానకార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు, జిల్లా అధ్యక్షులు కోత పూర్ణచంద్రరావు, కోచ్ ఎం.మధుసూధనరావు, చీఫ్ రిఫరీ ఎస్.అజయకుమార్, జిల్లా సంఘం ప్రతిధులు గొండు శంకర్, సూర శ్రీనివాసరావు, నడుకుదిటి ఈశ్వరరావు, తేజ, రమణమూర్తి, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మంత్రి ఆర్‌కె రోజా చేతులమీదుగా ట్రోఫీ అందుకుంటున్న శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు

జాతీయ పోటీలకు ఇద్దరు ఎంపిక

ఈ టోర్నీలో అత్యద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్న శ్రీకాకుళం జిల్లా క్రీడాకారిణులు ముంత గాయత్రి (ఎచ్చెర్ల), సింగూరు నందిని (ఎచ్చెర్ల గురుకుల విద్యాలయం) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జనవరి నెలలో బీహార్‌లోని పాట్నా వేదికగా జరిగే జాతీయ పోటీలకు ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు తరఫున వీరిద్దరు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిద్దరూ ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. మరోసారి స్టార్ ఆఫ్ ఆంధ్రాగా ఎచ్చెర్లకు చెందిన ముంత గాయత్రి ఎంపికై మంత్రి రోజా చేతులమీదుగా బహుమతి అందుకుంది.

జిల్లాస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల విజేత బహడపల్లి

మందస: బహడపల్లిలో గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. శ్రీచండేశ్వరి అమ్మవారి పేరిట ఈ పోటీలను నిర్వహించారు. జిల్లా స్థాయిలో మొత్తం 56 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిని బహడపల్లి జట్టు రూ.10,016లు, ద్వితీయబహుమతిని పొందూరు జట్టు రూ.8,016లు, తృతీయ, చతుర్థ బహుమతులు చెరో రూ.5,016లను ఉదయపురం(పలాస), కొండవూరు(పలాస) జట్లు కైవసం చేసుకున్నాయి. బెస్ట్ రైడర్, డిఫెండర్లుగా ఎంపికైన క్రీడాకారులకు కూడా నగదు బహుమతులను అందజేశారు. విజేతలందరికీ నగదు పాటు షీల్డ్‌లు కూడా అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సీనియర్ క్రీడాకారులు సాలీన జానకిరావు, వినోద్, మాజీ ఎంపీటీసీ మామిడి కృష్ణారావు, సాలీన ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

'పోలియో శాశ్వత నిర్మూలనే ధ్యేయం'

శ్రీకాకుళం అర్బన్: పోలియో శాశ్వత నిర్మూలనే రోటరీ ధ్యేయమని రోటరీ క్లబ్ పోలియో నివారణ కమిటీ చైర్మన్ ఎంఆర్‌కే దాస్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళంలో పోలియోపై అవగాహన, విరాళాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ పోలియో నివారణ కమిటీ చైర్మన్ ఎంఆర్‌కే దాస్ మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ 1979 సంవత్సరంలో పోలియో నిర్మూలనకు పోరాటం ప్రారంభించిందన్నారు. పోలియో వ్యాధిని సమూలంగా రూపుమాపేందుకు తొమ్మిది వందల కోట్ల రూపాయలు సేకరించే దిశగా ప్రయాణం మొదలెట్టి 2023 నాటికి 17వేల కోట్ల రూపాయలు విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ఏడాది శ్రీకాకుళం రోటరీ క్లబ్ తరఫున క్లబ్ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్, కార్యదర్శి అన్నెపు అనంతరావు ఆధ్వర్యంలో రోటరీ ప్రతినిధుల సహకారంతో పోలియో నిధికి ఐదు లక్షల రూపాయలు విరాళాల సేకరణ లక్ష్యంగా ప్రారంభించి ఇప్పటి వరకు ఒక లక్ష విద్యార్థుల ద్వారా సేకరించామన్నారు. రాఫిల్ టికెట్స్, విరాళాల బాక్సుల ద్వారా అలాగే మరింత విద్యార్థుల ద్వారా సేకరించి లక్ష్యం పూర్తిచేసే దిశగా శ్రీకాకుళం రోటరీ క్లబ్ కృషి చేస్తుందన్నారు.



పోలియో నిర్మూలనకు నిధులు సేకరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నూజివీడులో రసవత్తరంగా కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న కృష్ణా-గుంటూరు జట్ల క్రీడాకారులు

- లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహణ
- నేడు ఫైనల్స్ మ్యాచ్‌లు

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న 71వ మహిళల, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సోమవారం సాయంత్రం ఏడు గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు, క్రీడల వల్ల పోటీతత్వం అలవడుతుందని, పేరుప్రతిష్టలు లభిస్తాయన్నారు. క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు.

సెమీస్‌కు చేరిన పురుషుల జట్లు

పురుషుల విభాగంలో కృష్ణా, శ్రీకాకుళం, నెల్లూరు, విజయనగరం జట్లు సెమీస్‌కు చేరాయి. లీగ్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో నెల్లూరు జట్టు శ్రీకాకుళంపై 33-31, కృష్ణా జట్టు విజయనగరంపై 30-22, నెల్లూరు జట్టు పశ్చిమగోదావరిపై 24-17, కృష్ణా జట్టు గుంటూరుపై 37-22, శ్రీకాకుళం జట్టు పశ్చిమగోదావరిపై 41-13, విజయనగరం జట్టు గుంటూరుపై 29-14 తేడాతో గెలుపొందాయి.

మహిళల విభాగంలో..

శ్రీకాకుళం జట్టు విశాఖపట్నంపై 36-25, కృష్ణా జట్టు విజయనగరంపై 47-43 తేడాతో గెలుపొందాయి. మహిళల లీగ్ పోటీలు పొద్దుపోయే వరకు కొనసాగాయి. రిఫరీస్ బోర్డు కన్వీనర్ కే బాలు, రిఫరీలుగా ఎస్.మంగరాజు, ఎం.గణపతిరావు, బి.రామకృష్ణ, ఆర్.అప్పలస్వామి, కె.గోపిరాజు, బి.నాగేశ్వరరావు, పి.నరేంద్ర, వి.అనిల్, కె.జగదీష్ వ్యవహరించారు. కాగా ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం జరగనున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు రామిశెట్టి మురళీకృష్ణ, సెక్రటరీ తిరుమలశెట్టి వెంకట కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, సబ్బినేని శ్రీనివాస్, దాసరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రెండు వర్గాలపై కొట్లాట కేసు నమోదు

రణస్థలం: మండలంలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామని జేఆర్‌పురం ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. రణస్థలం గ్రామానికి చెందిన మహంతి గురునాయుడు, కొమ్మోజు ఉమాపతి జేఆర్ పురం గ్రామానికి చెందిన పైడిపల్లి జయరాజ్, దిలీప్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం రాత్రి పాత పోలీస్ స్టేషన్ పక్కన మహంతి గురునాయు డు, జయరాజ్‌కు మధ్య మాటామాటా పెరిగి వివాదం తలెత్తింది. కాసేపటి తర్వాత జయరాజ్ షాపు వద్దకు గురునాయుడు తన అనుచరులతో వెళ్లారు. అక్కడ మళ్లీ ఘర్షణ జరిగి కర్రలతో కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో గురునాయుడు, కొమ్మోజు ఉమాపతి ఇద్దరూ కొండములగాం ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. మరో వర్గీయులైన జయరాజ్, దిలీప్‌లకు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. రెండు వర్గాల వచ్చి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కస్తూరి భద్రయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రునిది ఆమదాలవలస మండలం అక్కి వరం గ్రామం. అతను స్వగ్రామం నుంచి తమ్మినాయుడుపేటకు సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఆ వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి వైజాగ్ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

నందిగాం: మండలంలోని పాత్రునివలస జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిషా కటక్ జిల్లా ప్రజాపడకు చెందిన నిహార్ రంజన్ మహంతి(36) కటక్ నుంచి స్టీల్ రాయి లోడ్‌తో విశాఖ పట్నం స్టీల్‌ప్లాంటుకు వెళ్లి అక్కడ లోడ్ దించేశాడు. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుంచి పశువుల దాణా లోడ్‌తో కటక్ వెళ్తూ సోమవారం ఉదయం 5 గంటలకు మండలంలోని పాత్రునివలస వద్దకు వచ్చే సరికి లారీ టైర్ల గాలి చెక్ చేయడం కోసం దిగాడు. టైర్లు చెక్ చేస్తూ వాటి మధ్య ఉన చిన్న రాళ్లు తీస్తుండగా టెక్కలి నుంచి పలాస వైపు వస్తున్న లారీ అతి వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో నిహార్ రంజన్ కింద పడిపోగా అతనిపై నుంచి లారీ వెళ్లిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీ కొన్న లారీలో ఉన్న క్లీనర్ బీవీ నర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం గమనించిన స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి నందిగాం పోలీసులు చేరుకొని నిహార్‌రంజన్ మహంతి మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతుని అన్నయ్య నిర్మల్ రంజన్ మహంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన నిహార్ రంజన్ మహంతి

చదువుకు అవకాశం

- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెల్లడి
- దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకు గడువు పెంపు
- వయస్సుతో నిమిత్తం లేకుండా చదువుకునేందుకు అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: చదువుకోవాలని ఆసక్తి ఉండి అవకాశాలు లేక, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, రోజువారి స్కూల్/కాలేజీకి వెళ్లలేక.. చదువుకోని వారికి ఓపెన్ స్కూల్ బాసటగా నిలుస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నామమాత్రపు ఫీజుతో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా (ఏపీ ఓపెన్ స్కూల్) దూరవిద్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. రెగ్యులర్ చదువుతో సమానమైన ఈ విద్యను వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేలా సర్కారు ప్రోత్సహిస్తోంది.

వయస్సుతో సంబంధం లేకుండా..

ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అండగా నిలుస్తోంది. రెగ్యులర్‌గా పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారు, వివిధ కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారు, తక్కువ విద్యార్హతతో ఏళ్ల తరబడి చిరుద్యోగం చేస్తున్నవారు, వ్యాపారులు, బాలికలు, గృహిణులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, ఆయాలు, దిగువస్థాయి ప్రజాప్రతినిధులు ఇలా ఎవరైనా చేరవచ్చు. గతంలో ఈ దూర విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. కానీ ప్రస్తుతం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో చదువుకోవచ్చు. రెండేళ్ల ఇంటర్ విద్య అయినా, పదో తరగతైనా ఏడాదిలోనే పూర్తి చేసుకునే వెసులుబాటు ఓపెన్ స్కూల్ ద్వారానే లభిస్తుంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ప్రభుత్వం ఇదివరకే నోటిఫికేషన్‌ను వెలువరించింది. మరోసారి గడువు పెంచింది. ఈనెలాఖరు వరకు అవకాశం కల్పించింది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో ప్రవేశానికి అర్హులు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.



ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్

రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానం

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కు విలువ ఉంటుందో లేదోననే అపోహ ఆది నుంచి చాలా మందిలో ఉంది. అయితే అది పూర్తిగా అవాస్తవం. ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకున్న విద్య రెగ్యులర్ విద్యతో సమానమే. ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సాధారణ పాఠశాల విద్య, కళాశాల విద్య సర్టిఫికెట్లతో సమానం. ఈ సర్టిఫికెట్లతో ఉన్నత విద్యకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని విద్యాశాఖాధికారులు, యూనివర్సిటీ అధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాస్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు నేరుగా అభ్యర్థుల చిరునామాకే పంపించేలా చర్యలు తీసుకుంటున్నారు.

బాలికా విద్యకు ప్రోత్సాహం..

బాలికా విద్యను ప్రోత్సహించేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. ఆర్థిక కారణాలు, సమీపంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్య అందుబాటులో లేక వేలాది మంది బాలికలు, గృహిణులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. అలాంటి వారు చదువుకునేందుకు ప్రభుత్వం ఫీజులో రాయితీ కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. వీరితోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు, మాజీ సైనికుల పిల్లలకు కూడా ప్రవేశ రుసుం ఫీజులో రాయితీ కల్పిస్తోంది.

ఓపెన్ స్కూల్ వరం



వివిధ కారణాలతో చదువు మధ్యలో చదువు ఆపేసినవారికి ఓపెన్ స్కూల్ వరం లాంటిది. టెన్త్, ఇంటర్ పూర్తి చేయడానికి మంచి అవకాశం. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్ విద్య సర్టిఫికెట్‌తో సమానం. ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. వలంటీర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ తీసుకోవాలి. – కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం

జిల్లాలో స్టడీ సెంటర్లు ఇలా..

జిల్లాలో ఎస్ఎస్‌సీకి 47 స్టడీ సెంటర్లు, ఇంటర్మీడియెట్‌కు 28 స్టడీ సెంటర్లు ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి మండలంలో దాదాపుగా అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. ఆసక్తి గల వారికి ప్రవేశాలు కల్పించి ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు ఎంచుకున్న మీడియం ప్రకారం పాఠ్యపుస్తకాలను, మెటీరియల్స్‌ను అందజేయనున్నారు. టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరాలనుకునే వారు తెలుగు, ఇంగ్లిష్‌తోపాటు ఇతర మీడియంలలో కూడా కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉంది. ఇంటర్మీడియెట్‌లో సైన్స్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ ఇతరత్ర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఓపెన్ స్కూల్ సొసైటీ ముఖ్యమైన సమాచారం తెలియజేసేందుకు, అలాగే విద్యనభ్యసిస్తున్న అభ్యర్థుల పాఠాల కోసం 'జ్ఞానధార' పేరిట ప్రత్యేక యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించారు.

క్లుప్తంగా

ముగ్గురిపై దాడి కేసు నమోదు

వీరఘట్టం: ఈనెల 23న వీరఘట్టంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో పండ్లు విక్రయిస్తున్న ఎస్.అచ్యుతరావుపై స్థానిక రెల్లివీధికి చెందిన దేవుపల్లి రఘు, దేవుపల్లి అశోక్, సిరిపురం శ్రావణ్‌లు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వి.రమణ మంగళవారం తెలిపారు. గాయపడిన అచ్యుతరావును చికిత్స కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


కేజీహెచ్‌లో మృతి చెందిన రైతు సూరినాయుడు

లక్కవరపుకోట: పాము కాటుకు గురైన మండలంలోని జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన రైతు బోజంకి సూరినాయుడు (74) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. సూరినాయుడు ఈ నెల 16న గ్రామ సమీపంలో వరిపంటకు నీరు పెడుతున్న సమయంలో పాము కాటువేసింది. దీంతో స్పృహకోల్పోయిన సూరినాయుడిని పక్క పొలాల్లో ఉన్న రైతులు గ్రామానికి తీసుకొచ్చి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య అప్పలకొండమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కొండబాబు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..


పోలినాయుడు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని తారాపురంలో సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తారాపురం గ్రామానికి చెందిన బెవర పోలినాయుడు(49)పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి సాలూరు నుంచి రామభద్రపురం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో రోడ్డు దెబ్బతిన్న పోలినాయుడు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఢీకొట్టిన బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోతుండగా గమనించి స్థానికులు ద్విచక్రవాహనాలపై వేగంగా వెళ్లి బస్సును ఆపారు. తాను ఢీ కొనలేదని బస్సు డ్రైవర్ బుకాయిస్తుండగా పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సురేంద్రనాయుడు డ్రైవర్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయగా తానే ఢీ కొట్టినట్టు ఒప్పుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె మాధవి, కుమారుడు జగదీష్ ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు.కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


చెట్టుకు ఉరి వేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని చాకలి బెలగాం శివారులో జంఝావతి కాలువ పక్కన బొడ్డచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించామని ఎస్సై దినకర్ తెలిపారు. బెలగాం వీఆర్‌ఓ నారాయణపురం వెంకటరావు ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. ఉరివేసుకుని ఉన్న వ్యక్తి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. ఆకుపచ్చ టీ షర్టు, నీలిరంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఈ వ్యక్తి సమాచారం తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మైనార్టీ కమిటీ సభ్యుల ఎంపిక

విజయనగరం టౌన్: ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన 15 సూత్రాల పథకాన్ని జిల్లాస్థాయిలో అమలుచేసే కమిటీలో సభ్యులుగా డాక్టర్ పి.ప్రేమానందం, మునిర్ మొహమ్మద్, షేక్ సలీంలను ఎంపికయ్యారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతులమీదుగా మంగళవారం నియామకపత్రాలను అందుకున్నారు. మైనార్టీ వర్గాల నుంచి తమకు అవకాశం కల్పించినందుకు వారంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎంపికతో తమపై మరింత బాధ్యత పెరిగిందని, సమాజ సేవ చేసేందుకు అవకాశం వచ్చిందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సత్యనారాయణరాజు, బిషప్ ఎం.పాల్సన్, రెవరెండ్ డి.ఎలీషా, జి.శ్రీధర్, థామస్ పాల్, బి.ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- ఫోర్టిఫైడ్ రైస్‌తో సంపూర్ణ పోషణ
- జిల్లాలో 9,163 టన్నుల బియ్యం పంపిణీ


ఫోర్టిఫైడ్ బియ్యం


ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం స్టాక్

విజయనగరం అర్బన్: ప్రజారోగ్యానికి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో పేద బడుగు వర్గాల ప్రజలకు పౌష్టికాహార లోపాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రైస్ కార్డు లబ్ధిదారులకు పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తోంది.

జిల్లాలో 5,81,214 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా 9,163 టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఫోర్టిఫైడ్ బియ్యం భుజించడం ద్వారా శరీరానికి సుక్ష్మపోషకాలు అందుతాయి. ప్రధానంగా పౌష్టికాహార లోపం ఉన్న మహిళలు, చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యం లోపం ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బి 12తో చేసిన పిండితో ఫోర్టిఫైడ్ బియ్యం కెర్నెల్స్ తయారు చేస్తారు. వీటిని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యంలో కలుపుతారు. ఐసీడీఎస్, ప్రజాపంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ పథకాల్లో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది.

శరీరానికి అధికంగా సూక్ష్మపోషకాలు

ఫోర్టిఫైడ్ బియ్యం ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. ముఖ్యంగా ఇందులోని ఫోలిక్ యాసిడ్ గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పిల్లల్లో మెదడు, వెన్నెముక పెరుగులకు తోడ్పడుతుంది. ఇక విటమిన్ బి12 మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి, ఎర్ర రక్తకణాల ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని సరైన మోతాదులో ఉంచుతూ రక్తహీనతను అరికట్టడంలో ఐరన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది.

400 మైక్రో గ్రామ్స్ అవసరం

రోజూ తీసుకునే ఆహారంలో 400 మైక్రోగ్రామ్స్ ఫోలిక్ యాసిడ్ ఉండేలా చూసుకోవాలి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా మనం తీసుకునే 100 గ్రాముల అన్నంలో ఫోలిక్ యాసిడ్ 17 మైక్రోగ్రామ్స్ నుంచి 125 మైక్రోగ్రామ్స్ మధ్య ఉండాలి. అదే విధంగా ఐరన్ 28 నుంచి 42 మిల్లీగ్రాములు ఉండాలి. ఇక ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం 100 గ్రాముల్లో 98 మైక్రోగ్రామ్స్ ఫోలిక్ యాసిడ్, ఐరన్ 40 మిల్లీగ్రాములు ఉంటుంది. ఇక విటమిన్ బి12 సమృద్ధిగా లభిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరమో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఉండే పోషక విలువల గురించి వివరిస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయనే విషయాన్ని బియ్యం పంపిణీ చేసే సమయంలో కార్డుదారులకు తెలియజేయాలని వలంటీర్లకు, ఎండీయూ వాహన నిర్వాహకులకు చెబుతున్నాం.

– మధుసూదనరావు, డీఎస్ఓ

పుష్కలంగా సూక్ష్మ పోషకాలు



ఫోర్టిఫైడ్ బియ్యంలో సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బి12 కలిగిన ఈ బియ్యంతో చేసిన పదార్థాలు బలవర్థకమైన ఆహారం. ఈ బియ్యం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత దూరమవుతుంది. ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలపై ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్

ఉత్సాహంగా వాక్ ఫర్ హెల్త్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం


వాకింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయగనరం: విజయనగరం ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లమ్మవారి జాతరమహోత్సవం, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు ఉల్లాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో 40 ఏళ్ల వయస్సు గల వారికి నిర్వహించిన వాకింగ్ పోటీల్లో వాకర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వాకర్స్‌కు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబులు బహుమతులు ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా ఉత్సవాల్లో భాగంగా 25న నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు రామగోపాల్ తెలిపారు. ఆసక్తి గల వారు పోటీల్లో పాల్గొవచ్చని పేర్కొన్నారు.

ఫైనల్స్‌కు ముంబై, మహారాష్ట్ర


ముంబై జట్టు


మహారాష్ట్ర జట్టు

విజయనగరం: ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వేదికగా జరుగుతున్న అండర్–19 అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్ టోర్నీలో ముంబై, మహారాష్ట్ర జట్లు వరుస విజయాలతో దూసుకెళ్తున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన ఇరుజట్లు మంగళవారం జరిగిన సెమీస్‌లో దూకుడు కనబరిచి బరోడా, తమిళనాడు జట్లను మట్టి కరిపించాయి. ఈనెల 26న డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరగనున్న ఫైనల్స్ మ్యాచ్‌లో ముంబై, మహారాష్ట్ర జట్లు తలపడనున్నాయి.

సిరులు కురిపిస్తున్న పూలు


నెల్లిమర్ల మండలం నారాయణపురంలో సాగులో ఉన్న గులాబీ తోట

- బంతి, చామంతి, గులాబీలకు డిమాండ్

విజయనగరం ఫోర్ట్: పూలు సాగు చేసే రైతులు నాలుగు రాళ్లు వెనుకేసుకుంటున్నారు. అన్ని రకాల పూలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో పూల సాగు సిరులు కురిపిస్తోంది. సాగు లాభదాయకంగా ఉండడంతో జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు ఆ బాట పట్టారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకం సాగు చేస్తుండగా కొన్ని ప్రాంతాల్లో అన్ని రకాల పూలను సాగు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన తోటల వద్దకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసుకుంటున్నారు. మరి కొంతమంది రైతులు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అయ్యప్ప మాల ధారణ ప్రారంభం కావడంతో పూల వినియోగం పెరిగింది.

40 వేల హెక్టార్లలో పూల సాగు

జిల్లాలో 40 వేల హెక్టార్లలో పూలు సాగవుతున్నాయి. 20 వేల హెక్టార్లలో బంతి, 10 వేల హెక్టార్లలో గులాబీ, చామంతి 5 వేలు హెక్టార్లు, మల్లె, కనకంబరాలు 5 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు.

గణనీయంగా పూల వినియోగం

గతంలో పూల వినియోగం తక్కువగా ఉండేది. ప్రస్తుత కాలంలో గణనీయంగా పెరిగింది. శుభకార్యాలు, బర్త్‌డే, ఇతర ఫంక్షన్లకు గతంలో ప్లాస్టిక్ ఫ్లవర్స్‌తో డెకరేషన్ చేసేవారు. ప్రస్తుతం శుభకార్యాలలకు బంతి, చామంతి, గులాబీలను వినియోగిస్తున్నారు.

కార్తీక మాసంలో బంతిపూలకు డిమాండ్

కార్తీక మాసంలో అయ్యప్ప మాల ధరించే స్వాములు ఎక్కువగా ఉండడంతో దీంతో బంతి పూలకు డిమాండ్ ఉంటుంది. అయ్యప్ప స్వాములు అంబలం పూజలు, ఇడుముడి కట్టేటప్పుడు ఎక్కువగా బంతి పూల వినియోగం ఉంటుంది. బంతి, గులాబీలతో కూడిన దండలు, బంతి, చామంతిపూలతో కూడిన దండలకు డిమాండ్ ఉంది.

అధికంగానే పూలసాగు

జిల్లాలోని అన్ని మండలాల్లో పూలు సాగు చేస్తున్నారు. నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, రామభద్రపురం తదితర మండలాల్లో ఎక్కువగా పూల సాగు ఉంది. బంతి, చామంతి, గులాబీ పూలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది.

– జమదగ్ని, ఉద్యానశాఖ డీడీ

అభివృద్ధిని వివరించేందుకే సామాజిక బస్సుయాత్ర

- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అప్పలనరసయ్య


గొట్లాంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: గడిచిన నాలుగున్నరేళ్ల పదవీ కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల్లోకి తీసుకోని వెళ్లడానికే మంత్రుల సామాజిక బస్సు యాత్రను చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జ్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరయ్యలు పేర్కొన్నారు. ఈనెల 27న గజపతినగరం నియోజకవర్గంలో బస్సు యాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఈ మేరకు బొండపల్లి మండలంలోని గొట్లాం గ్రామంలో గల సచివాలయం ఆవరణలో మంత్రులు బస చేయనున్న ప్రాంతాన్ని, అలాగే అందుకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం గజపతినగరంలోని మెంటాడ రోడ్డులో నిర్వహించనున్న బస్సు యాత్ర బహిరంగ సభకు సంబంధించి సభాస్థలం ప్రాంతాన్ని పరిశీలించారు. సభకు సూమారు 20 వేల మంది వరకు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు, సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులకు స్పష్టం చేశారు. సామాజిక బస్సు యాత్రకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలు నాయుడు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, పీడిక రాజన్న దొర, మాజీ మంత్రి పేర్నినాని, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు.

28న రామతీర్థం దేవస్థానం మూసివేత


రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని ఈ నెల 28న మూసివేస్తున్నట్లు దేవస్థాన ఈఓ కిషోర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం ఆరోజు అర్ధరాత్రి 1 గంట నుంచి 2.30 వరకు సంభవిస్తున్న కారణంగా 28న సాయంత్రం 5గంటలకు దేవస్థానంలో దర్శనాలు నిలిపి వేస్తున్నామని పేర్కొన్నారు. వేకువ జామున స్వామి సన్నిధిలో సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం దేవాలయంలో దర్శనాలకు అనుమతిస్తామని భక్తులు గమనించాలని కోరారు.

నవంబర్ 3న నాస్ పరీక్షకు సన్నాహాలు


రామభద్రపురంలోని చింతల వీధి ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- 26,383 మంది విద్యార్థులకు సామర్థ్య పరీక్ష
- సన్నద్ధమవుతున్న విద్యాశాఖ

రామభద్రపురం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మరింత మెరుగుపడేలా విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఈ మేరకు నిపుణులైన ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలను సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తున్నాయి. అభ్యసన సామర్థ్యం, స్థాయి మెరుగుకు ఉపాధ్యాయులకు సైతం అవసరమైన శిక్షణ ఇచ్చి బోధనా పద్ధతుల్లో వినూత్న మార్పులు తీసుకువచ్చాయి. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిన నేపథ్యంలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం ఏ మేరకు మెరుగుపడిందో తెలుసుకునేందుకు జాతీయ స్థాయిలో నవంబరు 3న కేంద్ర ప్రభుత్వ అసెస్‌మెంట్ సర్వే(ఎన్ఏఎస్),రాష్ట్ర ప్రభుత్వ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే(ఎస్ఈఏఎస్) పరీక్ష నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 675 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో 3,6,9 తరగతులు చదువుతున్న ర్యాండమ్‌గా గుర్తించిన 26,383 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

పకడ్బందీగా పరీక్ష నిర్వహణ

జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది. ఈ పరీక్షలు నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లుగా డిగ్రీ, డీఎడ్,బీటెక్ ,పీజీ విద్యార్థులు 1151 మందిని విద్యాశాఖ నియమించింది. ఈ పరీక్షను పర్యవేక్షించేందుకు బ్లాక్ కో ఆర్డినేటర్లుగా ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించింది.

విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు



నాస్ పరీక్ష నిర్వహణ వల్ల విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. విద్యాబోధన, అభ్యసన విషయాల్లో మార్పుచేర్పులు జరిగాయి.విద్యార్థుల స్థాయి పెంపొందిచేలా బోధనలో వినూత్న పద్ధతులు, సాకేంతికత వచ్చాయి. ప్రస్తుతం విద్యార్థుల అభ్యసన సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోవడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్ష మంచి అవకాశం. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగా రానున్న రోజుల్లో చేపట్టాల్సిన విద్యా విషయక చర్యలు, మార్పులపై స్పష్టత వస్తుంది.

– లింగేశ్వరరెడ్డి, డీఈవో, విజయనగరం

ట్యాంకర్ ఢీకొని ఇద్దరి మృతి


సంఘటనా స్థలంలో రవికుమార్ మృతదేహం


రవికుమార్ (ఫైల్)

- ఒకరికి గాయాలు

గరుగుబిల్లి: మండలంలోని ఖడ్గవలస–నాగూరు ప్రధాన రహదారి పరిధిలో ఎర్రన్నగుడి జంక్షన్ నుంచి నాగూరువైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురిని వీరఘట్టంనుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో సోమవారం జరిగిన ప్రమాదంలో సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మహిళ మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానిక ఎస్సై ఎం. రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలంలోని గొట్టివలసకు చెందిన బోను రవికుమార్, అడ్డాపుశీలకు చెందిన గడదేశి గౌరమ్మ(42), కొత్తూరు గ్రామానికి చెందిన కొప్పర గౌరీశంకరరావులు బైక్‌పై ప్రయాణిస్తుండగా ట్యాంకర్ ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి వారు ముగ్గురూ రోడ్డుమీదకి తుళ్లిపడ్డారు. ఆ సమయంలో రవికుమార్ తలపై నుంచి ట్యాంకర్ టైర్లు వెళ్లడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. గౌరమ్మ అపస్మారక స్థితికి చేరుకోవడంతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. బైక్ నడుపుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన కొప్పర గౌరీశంకరరావుకు గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రవికుమార్‌కు భార్య రాధతో పాటు తల్లి అక్కమ్మ, కుమారుడు శశిశేఖర్, కుమార్తె ద్రాక్షాయిని ఉన్నారు. గౌరమ్మ తన అన్న గడిదేశి గంగులు ఇంటి వద్ద నివసిస్తోంది. మృతుడు రవికుమార్ భార్య రాధ ఫిర్యాదుమేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పండగ పూట విషాదం నెలకొనడంతో గొట్టివలస, అడ్డాపుశీల గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్సైతో చర్చించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ సమీపంలో ఐటీఐ కళాశాల వద్ద బైక్ అదుపుతప్పి కుశిమి గ్రామానికి చెందిన కె.దిలీప్ అలియాస్ చంటి (25) సోమవారం మృతి చెందారు. కొత్తూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొట్టి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొనఊపిరితో ఉన్న యువకుడిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


సంతకవిటి: నదీ తీరంలో అవినాష్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

సంతకవిటి: మండల పరిధి తమరాం వద్ద ఆదివారం నాగావళి నదిలో స్నానానికి దిగి గల్లంతైన విద్యార్థి గంటా అవినాష్(21) మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైందని ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని రాజాంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినట్లు వెల్లడించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


బాడంగి: ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు

బాడంగి: మద్యానికి బానిసై తరచూ కుటుంబంలో తగాదాలతో విరక్తి చెందిన వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా తెలిసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డొంకినవలసకు చెందిన అంబటి శ్రీనివాసరావు (44) శనివారం పురుగు మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు 108లో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ డి.సన్యాశిరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అరటి పండ్లు, చికెన్ సరఫరాకు టెండర్లు

సీతంపేట: గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీగురుకులాలకు అరటి పండ్లు, చికెన్ సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమడి గురుకుల పాఠశాల, సీతంపేట, కారిగూడ మినీ గురుకులాలు, ఏకలవ్య మోడ్ స్కూల్స్‌కు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు సొమ్ము ఆయా సంస్థల పేరిట డీడీల రూపంలో టెండర్ షెడ్యూల్‌కు జతపర్చాలన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు రూ.500లు నగదు చెల్లించి టెండర్‌షెడ్యూల్‌ను గురుకులం సెల్‌కు అందజేయాలన్నారు. 26న ఐటీడీఏలో టెండర్ నిర్వహిస్తామని చెప్పారు.

జాతీయ క్రీడల పరిశీలకుడిగా వేణుగోపాల్

విజయనగరం: గోవాలో ఈ నెల 26 నుంచి నవంబర్ 9వ తేదీవరకు జరగబోయే 37వ జాతీయ క్రీడలకు జిల్లాకు చెందిన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావును డిప్యూటీ చీఫ్ కమిషన్‌గా ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ నియమించింది. ఈ పదవికి మొట్ట మెదటిసారిగా విజయనగరం జిల్లా నుంచి ఎంపిక చేసినందుకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, క్రీడా సంఘాల ప్రతినిధులు వేణుగోపాల్‌కు అభినందనలు తెలిపారు.